మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

జిల్లా ప్రభుత్వ దవాఖానలోని వైద్య సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్

వనపర్తి, మే 21 : ప్రభుత్వ దవాఖానలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ దవాఖానలో అందుతున్న వైద్యసేవలపై కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులతో మాట్లాడారు. రోగులకు ల్యాబ్ పరీక్షలు చేసిన అనంతరం ప్రింటెండ్ రిపోర్టులను సకాలంలో అందజేయాలన్నారు. మందుల నిల్వలు సక్రమంగా మెయింటెన్ చేయాలని సూచించారు. అంతకుముందు దవాఖానలోని అన్ని వార్డుల్లో వైద్యాధికారులతో కలిసి తిరిగారు. ఆయన వెంట సూపరింటెండెంట్ రంగనాథ్‌రావు, సీనియర్ ఆర్ఎంవోలు రవిశంకర్, ప్రభాకర్, వైద్యులు పాల్గొన్నారు.

నూతన వరి వంగడాలపై అవగాహన

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

మల్దకల్, మే 21 : వానకాలంలో సాగు చేసే నూతన వరి వంగడాలపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీసీలో రైతులకు సాగు మెళకువలు, నూతన విత్తనాలు రకాలు, వాటిని ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో డీఏవో గోవిందనాయక్, ఏడీఏ సంగీత లక్ష్మి, ఏవో రాజశేఖర్, గద్వాల్ డివిజన్ వ్యవసాయాధికారులు, ఏఈవోలు పాల్గొన్నారు.

బీచుపల్లి అంజన్నకు ప్రత్యేక పూజలు

బీచుపల్లిలో ధ్వజారోహణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఇటిక్యాల, మే 21: బీచుపల్లి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రహ్లాదాచారి, మారుతాచారి, సందీపాచారి, వాల్మీకి పూజారులు స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, వాస్తుహోమం, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం, తెప్పోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి రామన్‌గౌడ్ పర్యవేక్షించారు.

జూరాల కాల్వకు రక్షణ గోడ నిర్మించాలి

రక్షణ గోడని ర్మించాల్సిన జూరాల కాలువ రోడ్డు ఇదే

పెబ్బేరు, మే 21 : పెబ్బేరు పట్టణంలోని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వకు రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లే ప్రాంతంలో ఇటీవల కొత్త కాలనీ ఏర్పాటైంది. కాల్వకు చుట్టుపక్కల అక్కడక్కడ కూడా నివాస గృహాలు ఉన్నాయి. ఒకప్పుడు ఎవరూ తిరగని ఈప్రాంతాల్లో ఇప్పుడు చాలా మంది ఇండ్లను నిర్మించుకోవడంతో జన సంచారం మొదలైంది. అదీ గాక కాల్వపై బైక్‌లు, భారీ వాహనాలు సైతం నిత్యం తిరుగుతున్నాయి. వనపర్తి వైపు నుంచి కర్నూల్ వైపునకు వెళ్లే వాహనాలు పట్టణంలో నుంచి రాకుండా జూరాల కాల్వ మీదుగా వెళ్తూ దూరభారాన్ని తగ్గించుకుంటున్నాయి. ఈ క్రమంలో కాల్వపై వాహనాల రద్దీ గణనీయంగా పెరిగింది. మరో పక్క కాల్వకు యాభై మీటర్ల దూరంలోనే ఇండ్ల నిర్మాణం జరిగింది. ఇది మరీ ప్రమాదకరంగా తయారైంది. కాల్వకు, ఇండ్లకు మధ్య రోడ్డే అడ్డంగా ఉంది. ఇండ్ల ముందే జూరాల కాల్వ దర్శనమిస్తుంటుంది. దీంతో కాలనీ వాసులు దినదినగండంగా కాలం గడుపుతున్నారు. ఈ రోడ్డు మీద వెళ్తూ ఇప్పటికే పలు వాహనాలు అదుపు తప్పి కాల్వలో పడిన ఘటనలు ఉన్నాయి. ఆర్నెల్ల కిందట ట్రాక్టరు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లడంతో డ్రైవరు మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుడదన్నా, జూరాల ప్రధాన ఎడమ కాల్వకు రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరముందని పట్టణవాసులు అంటున్నారు. పాలకులు, అధికారులు ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

- పట్టించుకోని పుర అధికారులు

గద్వాల టౌన్, మే 21 : నిషేధిత ప్లాస్టిక్ వాడకంతో వ్యాధులు ప్రబలుతాయని ప్రభుత్వాలు, న్యాయస్థానాలు చెబుతున్నా.. వాటిని నిషేధించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా.. వాడకం మాత్రం ఆగడం లేదు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల సంతానోత్పత్తి, మానసిక రుగ్మతలు, దుందుడుకు స్వభావం, పిల్లల్లో బుద్ధిమాంద్యం వంటి జబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో ప్లాస్టిక్ వినియోగంపై అధికారులు తీసుకుంటున్న చర్యలు కూడా శూన్యం. దీంతో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగింది.

నిత్యం నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, విస్తరులు, కవర్లు, బాటిల్స్, వాటర్ ప్యాకెట్ల వాడకం పెరుగుతున్నా అధికారులు నామమాత్రంగా దాడులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం 40మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్‌నే వాడాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా, వ్యాపారులు పట్టించుకోకుండా చౌకగా లభించే కవర్లను వాడుతూ పర్యావరణ కాలుష్యానికి కారకులవుతున్నారు. అధికారులు ప్లాస్టిక్‌ను నిషేధించండి.. పర్యావరణాన్ని కాపాడండి అని గొంతు చించుకుని చెబుతున్నా ఇటు ప్రజలు, అటు వ్యాపారులు యథేచ్ఛగా వాడుతున్నారు. దాడుల సమయంలో కొంచం సమయం ఇవ్వాలని కోరుతున్న వ్యాపారులు.. ఆ తర్వాతే అందే తంతును కొనసాగిస్తున్నారు. దాడులు నిర్వహిస్తున్న అధికారులకు వ్యాపార సంఘాల నాయకుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. దీంతో అధికారులు ఏమీ చేయలేక గడువు మాత్రమే ఇస్తూ చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ వాడకంపై చర్యలు తీసుకుంటే తప్పా.. నివారించడం సాధ్యం కాదు.

నిషేధిత ప్లాస్టిక్‌ను వాడుతున్న ప్రజలు

చర్యలు తీసుకుంటున్నాం..

నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని ఆపాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చాం. ప్లాస్టిక్ కవర్లు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. విక్రయించినట్లు తెలిస్తే ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు భారీ జరిమానా విధిస్తాం. ప్రజలు కూడా అధికారులకు సహరించాలి.

–శంకర్‌సింగ్, మున్సిపల్ కమిషనర్

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

- 24 నుంచి జూన్ ఒకటి వరకు..
- 13 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 6,131 మంది విద్యార్థులు
- ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి మద్దిలేటి

వనపర్తి టౌన్, మే 21 : ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు జరుగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి మద్దిలేటి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్స్, ఏసీఎస్‌లతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని.. మొత్తం 6,131 మంది విద్యార్థులు (ఫస్టియర్ 3,978, సెకండియర్ 2,156 మంది విద్యార్థులు) పరీక్షలు రాస్తారన్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు పూర్తి ఏర్పాట్లు చేయాలని సీఎస్‌లు, డీవోలను ఆదేశించారు. విద్యార్థులు ఉదయం 8:30 గంటల వరకు కేంద్రాలకు చేరుకోవాలని, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2 గంటలోగా చేరుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని చెప్పారు. కేంద్రాల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకూడదని ఆదేశించారు. అలాగే ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. కలెక్టర్ ఆదేశానుసారం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఈసీ మెంబర్లు ప్రకాశం, శ్రీనివాసులు, సీఎస్‌లు, తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో మద్దిలేటి

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి
- అదనపు కలెక్టర్ ఎం.నగేశ్

చిన్నంబావి, మే 21 : అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఎం.నగేశ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు వెల్లగొండలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ఎండ ఉన్నప్పుడే ధాన్యాన్ని ఆరబెట్టి.. వర్షపు సూచనలు కనిపిస్తే టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలన్నారు. దళారులను నమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఇక్బాల్, డీటీ శ్రీనివాస్, ఆర్ఐ రాము, ఏపీఎం మద్దిలేటి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఇంద్ర, రైతులు, హమాలీలు తదితరులున్నారు.

వెలగొండలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఎం.నగేశ్

సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

వీపనగండ్ల, మే 21 : కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ నగేశ్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని తూం కుంట, పాన్‌గల్ మండలం వెంగలాయపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడా రు. అకాల వర్షాలతో నిల్వ చేసిన ధాన్యం తడిసిపోతుందని.. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణ మే సంబంధిత రైస్ మిల్లులకు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున నిల్వ చేసిన ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పాతపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మొక్కలు సకాలంలో అందించాలి

- ఎంపీడీవో రవీందర్

పెబ్బేరు, మే 21 : హరితహారం కార్యక్రమానికి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీందర్ ఆదేశించారు. మంగళవారం పాతపల్లి, అయ్యవారిపల్లిలో నర్సరీలు, ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడారు. ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 వరకు సంపాదించొచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో రోజ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దత్తాత్రేయుడికి పూజలు

కొత్తకోట, మే 21 : పట్టణంలోని అనుగాదేవి దత్తాత్రేయస్వామి దత్త ఆలయంలో మంగళవారం దత్తగిరి మహరాజ్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తూ మార్గమధ్యంలో దత్త ఆలయంలో భక్తులకు ఉపదేశమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కావలి కురుమయ్య

గోపాల్‌పేట, మే 21 : ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని బుద్ధారం గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మేస్త్రీ కావలి కురుమయ్య(46) 2021 జూలైలో ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకు రాలేదు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో నూ కురుమయ్య ఇలాగే వెళ్లి మళ్లీ ఇంటికొచ్చాడు. కాగా 2021లో వెళ్లాక ఇంతవరకు రాకపోవడంతో కురుమయ్య భార్య నాగేంద్రమ్మ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యోగా నారసింహస్వామికిఅభి షేకం

అలంపూర్, మే 21 : ఉత్తర వాహిణి అలంపురం క్షేత్రంలో వెలిసిన యోగానారసింహ స్వామి ఆలయంలో మంగళవారం జయంతి వేడుకలను దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను పూలతోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అర్చకులు స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రదోష కాలంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యోగానారసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

రావులను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా పెద్దమ్మ పండుగ

మదనాపురం, మే 21 : మండలంలోని తిర్మలాపల్లిలో మంగళవారం పెద్దమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ శశిరేఖమ్మ, కురుమన్న దంపతులు రావులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శారద, నాగశేషు, గ్రామ పెద్దలు కురుమన్న, రాములు, కృష్ణ, రాంచందర్, ఆంజనేయులు, వెంకటేశ్, రాఘవులు, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

వనపర్తిలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్/ గోపాల్‌పేట/ పెద్దమందడి/ అమరచింత/పెబ్బేరు/కొత్తకోట, మే 21 : భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మన్ మహేశ్ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపాల్‌పేట పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. అమరచింతలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి గీత కార్మిక సంఘం చైర్మన్ నాగరాజు గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తకోటలో మేస్త్రీ శ్రీను, వేముల శ్రీనివాస్‌రెడ్డి రాహుల్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వనపర్తి మున్సిపల్ వైస్‌చైర్మన్ కృష్ణ, పెద్దమందడి ఎంపీపీ రఘుప్రసాద్, కౌన్సిలర్లు, మాజీ జెడ్పీటీసీలు వెంకటస్వామి, పీజే బాబు, నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ సమావేశం

గద్వాల, మే 21 : జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కాంతమ్మ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్‌చౌక్‌లోని పాత ఎంపీడీవో సమావేశ హాల్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఉదయం 10:30గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి అధికారులతో పాటు జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

అమరచింత, మే 21 : మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను అందజేస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్‌కుమార్, సహాయ అధికారి రాజేశ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జీలుగ విత్తనాలు అవసరమున్న రైతులు భూమికి సంబంధించిన పాసుపుస్తకంతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో తమను సంప్రదించాలన్నారు. 50 కిలోల జీలుగ విత్తనాల బస్తాను రూ.1,116కు సబ్సిడీపై అందజేస్తామని ఏవో వినయ్‌కుమార్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల, మే 21 : 2024-25 విద్యాసంవత్సరానికి గానూ బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ అధికారి శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. గద్వాల జిల్లాలో ఐదు ఖాళీలు ఉన్నాయని.. జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులే అర్హులన్నారు. నేటి నుంచి జూన్ 6వ తేదీ సాయంత్రం ఐదుగంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అభ్యర్థి తల్లిదండ్రుల యొక్క వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షల లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, పుట్టినతేదీ, స్వస్థలం సర్టిఫికెట్, బోనఫైడ్, ఆధార్ కార్డు, రెండు పాస్ సైజ్ ఫొటోలు దరఖాస్తు వెంట జతచేసి ఇవ్వాలన్నారు. ధ్రువీకరణ పత్రాలపై తప్పనిసరిగా గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలన్నారు. దరఖాస్తు వెంట ఏ ఒక్క సర్టిఫికెట్ లేకున్నా తిరస్కరించబడుతుందన్నారు. దరఖాస్తు ఫారాలు గద్వాలలోని గిరిజన బాలుర వసతి గృహంలో.. లేదా వనపర్తి కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం రూమ్ నెంబర్ 118లో లభిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు 6301358738 నంబరును సంప్రదించాలని కోరారు.

డిగ్రీలో ప్రవేశానికి..

ఆత్మకూరు, మే 21 : పట్టణంలోని డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గానూ ఫస్టియర్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ, బీఎస్సీ, బీకాం, లైఫ్ సైన్స్ తదితర కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకోదలచిన విద్యార్థులు కళాశాలలో ఏర్పాటుచేసిన హెల్ప్ లైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత ధ్రువీకరణపత్రాలతో ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు దోస్త్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సామగ్రి చోరీ కేసులో నిందితుల రిమాండ్

పాన్‌గల్, మే 21 : పాన్‌గల్ విద్యుత్ ఉపకేంద్రంలో సామగ్రి చోరీ చేసిన కేసులో నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. మంగళవారం స్థానిక పీఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ 28న అర్ధరాత్రి పాన్‌గల్ విద్యుత్ ఉపకేంద్రంలో పెబ్బేర్‌కు చెందిన ఎనిమిదిమంది సామగ్రిని చోరీ చేశారు. సోమవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానితులుగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టామన్నారు. చోరీ సమయంలో వీరితోపాటు మరో ఆరుగురు ఉన్నట్లు తేలిందన్నారు. అందరినీ అదుపులోకి తీసుకొని విచారణ చేయగా చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. చోరీ సమయంలో నిందితులు ఉపయోగించిన రెండు ఆటోలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. అదేవిధంగా చోరీ చేసిన సామగ్రిని రికవరీ చేశామని తెలిపారు. ఏడుగురిని రిమాండ్‌కు తరలించగా.. ఒకరు పరారీలో ఉన్నట్లు ఎస్సై వెల్లడించారు.

రెండు మొబైల్ ఫోన్లు చోరీ

ఎర్రవల్లి చౌరస్తా, మే 21 : బీచుపల్లి పుణ్యక్షేత్రంలో మొబైల్‌ఫోన్లు చోరీకి గురైన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు హైదరాబాద్‌కు చెందిన కిరణ్, కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం బీచుపల్లిలో నిద్రచేయడానికి వచ్చారు. ఈ క్రమంలో సాగర్‌ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని యువకుడు మంగళవారం తెల్లవారుజామున రెండుగంటల ప్రాంతంలో కిరణ్, అతని తల్లి జానకమ్మ చెందిన ఫోన్లు చోరీ చేసి పారిపోయాడు. గమనించిన కిరణ్ ఉదయం సీసీ పుటేజీ పరిశీలించి, ఇటిక్యాల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై స్పందించిన ఎస్సై వెంకటేశ్ పుణ్యక్షేత్రానికి వచ్చే ప్రజలు జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

వనపర్తి, మే 21 : విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నాచహళ్లిలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. గ్రామ శివారులోని బండారు వెంకటయ్య పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రైవేట్‌గా కరెంట్ పని చేసే శంకర్ మంగళవారం విద్యుత్ పనులు చేస్తున్నాడు. అకస్మాత్తుగా షాక్ తగిలి కిందపడడంతో అతడిని వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి ఎడమ చేయి విరిగిందని, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. పొలం యజమాని విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేయించాడని లైన్‌మెన్ ఆంజనేయులు తెలిపారు. చికిత్స పొందుతున్న శంకర్‌ను ఎంపీపీ కిచ్చారెడ్డి పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న శంకర్